ప్రజాశక్తి

శుక్రవారం 19 ఏప్రిల్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అసెంబ్లీలో

ఐదోసారి అడుగుపెట్టేందుకు..?

- వరుస విజయాలతో జిల్లా రాజకీయ చారిత్రక రికార్డు
- నేడు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నామినేషన్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పార్టీలతో సంబంధం లేదు. ఎక్కడ పోటీ చేసినా ఆయన్ను ఓటర్లు ఆదరించారు. అఖండ విజయం చేకూర్చారు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఇప్పటికి వరుసగా నాలుగు సార్లు ప్రజల మనసులు గెలిచి అసెంబ్లీకి వెళ్లిన రాజకీయ చారిత్రక ఘనత అతనిది. ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ఎవరూ చేరుకోలేని విజయాలూ అందుకున్నారు. వివాదాలకు దూరంగా.. ఘర్షణలకు తావివ్వకుండా నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సంబంధం లేకుండా గెలిచారు. ఆయనే అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్. ఐదోసారి అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు ఆయన శుక్రవారంనాడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలిరానున్నారు. 2004లో ఆనాడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా పేరున్న మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెసు నుంచి అనూహ్య పరిణామాల మధ్య తన సోదరుడిపైనే పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గంలో తనదైన ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో మార్టూరు రద్దయింది. తర్వాత ఆయన అద్దంకి నియోజకవర్గానికి తన భవిష్యత్ రాజకీయాన్ని మార్చారు. అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్వయంగా ▶ 7లో

నామినేషన్ల పర్వం ప్రారంభం

నామినేషన్ వేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- ఒంగోలు పార్లమెంట్‌కి నలుగురు,
- 8 అసెంబ్లీలకు 9 మంది నామినేషన్లు..
- తొలిరోజున నామినేషన్లు దాఖలు చేసిన మాగుంట, బూచేపల్లి, కోన రఘుపతి..

దర్శిలో బూచేపల్లి నామినేషన్ ర్యాలీకి హాజరైన జనం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్య ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ విడుదల చేశారు. దీంతో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 9 మంది అభ్యర్థులు మొత్తంగా 13 నామినేషన్లను దాఖలు చేశారు. యర్రగొండపాలెం, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. నామినేషన్ల పర్వం ప్రారంభం కావటంతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్ఒ కార్యాలయం గేటు నుంచి 100 మీటర్ల లోపు ఎలాంటి వాహనాలను పోలీసులు అనుమతించలేదు. అభ్యర్థులకు సంబంధించి 3 వాహనాలను అనుమతించారు. నామినేషన్ దాఖలు ▶ 2లో

ఒంగోలులో నామినేషన్ వేస్తున్న మాగుంట

బాపట్లలో నామినేషన్ వేస్తున్న కోన రఘుపతి

నామినేషన్ వేస్తున్న కొండపి కాంగ్రెస్ అభ్యర్థి సతీష్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -ఒ ంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూములో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫారం-1 ఎన్నికల నోటిఫికేషన్ ను జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు గురువారం ఉదయం ▶ 2లో

మాట్లాడుతున్న రంజిత్‌బాషా

నామినేషన్ల కోసం కట్టుదిట్టమైన చర్యలు 8లో

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి..

- జిల్లా ప్రధాన సమస్యలపై సమాధానం చెప్పి వైసిపి, టిడిపి కూటమి ఓట్లు అడగాలి
- మతోన్మాదులను బలపరిచేవారికి తగిన బుద్ధి చెప్పాలి
- సిపిఎం నేతల డిమాండ్
- 2024 సిపిఎం ఎన్నికల ప్రణాళిక విడుదల

సిపిఎం 2024 ఎన్నికల ప్రణాళికను విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వచ్చే నెలలో జరిగే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసు, సిపిఎం, సిపిఐ బలపరిచిన ఇండియా వేదిక అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని సిపిఎం నాయకులు కోరారు. ఆ పార్టీ 2024 ఎన్నికల ప్రణాళికను గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో విడుదల చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతతత్వ బిజెపిని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన కూటమిని, నిరంకుశ వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన సమస్యలపై సమాధానం చెప్పి వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాళ్ల దాడులు, బూతు పురాణాలు ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా ముందుకు వచ్చాయన్నారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రజా సమస్యలను చర్చనీయాంశంగా ▶ 7లో

www.kimshospitals.com

KIMS | INSTITUTE OF VASCULAR SCIENCES

మీరు ఈ సమస్యలతో బాధపడుతున్నారా?



12 సంవత్సరాల అపారా అనుభవము కలిగిన బృందం

డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి

డా॥ అజయ్. బి. మోసూర్

M.S General Surgery, DNB Vascular Surgery
Consultant Vascular & Endovascular Surgeon
KIMS Hospitals, Secunderabad.

తేది : 21-04-2024 ఆదివారం

కిమ్స్ హాస్పిటల్స్ నార్త్ బైపాస్ రోడ్, ఒంగోలు

ఉ॥10గం॥ నుండి సా॥ 4గం॥. వరకు అందుబాటులో ఉంటారు

వివరములకు: 77999 80904, 70958 78686

నామినేషన్ల పర్వం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

చేయటానికి అభ్యర్థితో పాటు నలుగురుని ఆర్‌ఒ కార్యాలయంలోకి అనుమతించారు.

ఒంగోలు పార్లమెంట్‌కు నలుగురు నామినేషన్స్

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్ కుమార్ నామినేషన్స్ స్వీకరించారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా టిడిపి తరపున మాగుంట గీతాలత ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బూచి ఏడుకొండలు, బొడ్డు క్రాంతి కుమార్ వారి నామినేషన్స్‌ను జిల్లా ఎన్నికల అధికారికి అందజేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు 9 నామినేషన్లు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, బూచేపల్లి నందిని ఒక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మంచా మీనా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్లూరి కొండారెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కైలా వెంకటరావు నామినేషన్ వేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా ఆసోది శంకర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీపతి సతీష్ నామినేషన్ వేశారు. గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి జాతీయ చేతివృత్తుల వేదిక అభ్యర్థిగా ఈవి సురేష్ బాబు నామినేషన్ వేశారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థిగా దద్దాల నారాయణ యాదవ్ నామినేషన్‌ను దాఖలు చేశారు. యర్రగొండపాలెం, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బాపట్లలో తొలిరోజు 7 నామినేషన్లు దాఖలు...

బాపట్ల: జిల్లాలో తొలి రోజు గురువారం 7 నామినేషన్లు దాఖలు అయ్యాయి. బాపట్ల అసెంబ్లీ ఎన్నికల అధికారి సిహెచ్ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం.1, కటికల శివభాగ్యరావు (స్వతంత్ర) 2,కోన రఘుపతి(వైసిపి)3, కోన రమాదేవి(వైసిపి)4, దేవరకొండ రాజేశ్వరరావు(పెరమిడ్ పార్టీ)5,గుదే రాజారావు(బిఎస్పి) రెండు సెట్లు, 6,దోనెపాటి షాలిని (స్వతంత్ర) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

నేడు టిడిపి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు నామినేషన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి కూటమి యర్రగొండపాలెం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం తెలిపారు. టిడిపి కార్యాలయం నుంచి కొలుకుల సెంటర్, పెద్దమసీదు, స్టేట్ బ్యాంకు రోడ్డు, అంబేద్కర్ సెంటర్, తహశీల్దారు కార్యాలయం, పుల్లలచెరువు రోడ్డు, ఎన్టీఆర్ సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ సెంటర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపిడివో కార్యాలయ ఆవరణలో గల నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

11 గంటల్లోపు జారీ చేశారన్నారు. నిర్దేశించిన కార్యాలయాల్లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. అభ్యర్థులు నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను సమగ్రంగా సమర్పించాలన్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు నామినేషన్‌తో పాటు రూ.25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు నామినేషన్‌తో పాటు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 21న ప్రభుత్వ సెలవు దినం కావడంతో నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వీడియోగ్రఫీ ఏర్పాటు చేపట్టామన్నారు. ఈ నెల 18 నుంచి 25 తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ జరగనుందని, 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 29వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చన్నారు. అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు భారత ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటిస్తూ నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ సూచించారు. నామినేషన్ పత్రాలతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఆర్‌ఒ కార్యాలయం గేటు నుంచి 100 మీటర్ల అవతల వరకు మాత్రమే వాహనాలను అనుమతి ఉంటుందన్నారు. అక్కడ నుండి గేట్ వరకు 100 మీటర్లు మూడు వాహనాలకు అనుమతి వుంటుందని, గేటు నుంచి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి వుంటుందని ఆయన వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయడం తో పాటు నామినేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించామన్నారు. సుమారు 20 మంది పోటీ చేసే అభ్యర్థులకు కొత్త నామినేషన్ పత్రాలను హెల్ప్ డెస్క్ నుండి అందజేశామన్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలని సూచించారు. లేటెస్ట్ అఫిడవిడ్ ఫామ్-26, లేటెస్ట్ నామినేషన్ పత్రాలను మాత్రమే వినియోగించాలన్నారు. నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఆర్ శ్రీలత, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా సెయింట్ కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సీనియర్ జీనా జేవియర్ అన్నారు.

స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ ఆవరణలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ విద్యాశాఖ ఇన్‌చార్జి షర్మిల హాజరు కాగా, గౌరవ అతిథులుగా స్కూల్ పూర్వ విద్యార్థి డాక్టర్ జి రాజ్‌కుమార్, డాక్టర్ పి దినేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అనంతరం యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పత్రాలు, మెమెంటోలు ఆనందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మిస్టర్ ఎల్లా ట్రెసా, ప్రిన్సిపాల్ సీనియర్ జీనా జేవియర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: మార్కాపురం
ఐ.పి. నెం: 6/2021

జాజం శ్రీను .. పిటీషనర్
వర్సెస్
కనకా నాగేంద్ర మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్
1. షేక్ బాషా, తండ్రి: చిన్న జానీ,
వయసు: 52 సం॥,ముస్లిం, మసీదు ఎదురుగా,
అద్దంకి రోడ్డు, దర్శి టౌన్ అండ్ మండలం,
ప్రకాశం జిల్లా. **(ఆర్.9)**
2. షేక్ చాంద్‌బాషా, తండ్రి: సుభానీ,
వయసు: 37 సం॥,ఎఎస్‌ఆర్ కాంప్లెక్స్, అద్దంకి రోడ్డు, దర్శి టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా. **(ఆర్.13)**
3.నూలు శ్రీరామచంద్రమూర్తి, తండ్రి:
నరసింహారావు, వయసు: 50 సం॥, పిజిఎన్ కాంప్లెక్స్, పొదిలి రోడ్డు, దర్శి టౌన్, పోస్టు అండ్ మండలం, ప్రకాశం జిల్లా. **(ఆర్.32)**
4. మాదాసు ప్రసన్న, భర్త: నరసయ్య,
వయసు: 44 సం॥,నివాసం: వినాయక గుడి దగ్గర,
అద్దంకి రోడ్డు, దర్శి టౌన్ అండ్ మండలం,
ప్రకాశం జిల్లా. **(ఆర్.46)**
5. సింగంశెట్టి శ్రీను, తల్లి: పద్మావతి, వయసు: 47 సం॥, దేసువారి వీధి, చింతలపాలెం రోడ్డు, దర్శి టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా, (ఆర్.50)
6. వరికూటి శ్రీను, తండ్రి: వెంకటయ్య, వయసు: 42 సం॥,సందుపాలెం వారి గ్రామం, దర్శి పోస్ట్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా. **(ఆర్.52)**

పై నెంబరు ఇన్‌సాల్వెన్సి పిటీషన్‌ను పిటిషనర్ ఇన్‌సాల్వెంట్‌గా డిక్లెర్ చేయమని మీపై పైన కనబరిచిన కోర్టులో దరఖాస్తు దాఖలు చేసినందున సదరు పిటీషన్‌లో మీరు పై కోర్టులో తేదీ: 19-04-2024న ఉదయం 10:30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు
గెల్లి చౌడేశ్వరరావు
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 9985009542.

కాంగ్రెస్ అభ్యర్థి 'పగడాల'కు బి. ఫారం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్ద రంగస్వామి గురువారం అనంతపూరం వద్ద ధర్మవరం రోడ్‌లోని నారావారిపల్లెలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసి కాంగ్రెస్ పార్టీ బీఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల పెద్ద రంగస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గిద్దలూరు అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనను గిద్దలూరు అభ్యర్థిగా నియమించేందుకు కృషి చేసిన కాంగ్రెస్ పెద్దలు కెవిపి రామచంద్రరావు, ఏం రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పల్లం రాజులకు ధన్యవాదాలు తెలిపారు.

ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది

నాకు చెందిన నేను గతంలో విక్రయం పొందిన లింక్ ఒరిజినల్ దస్తావేజు నంబర్ 594 /1971 (తేదీ 31/ 03/ 1971) కి చెందిన డాక్యుమెంటును నేను ది 05-04-2024న ఫొటో స్టాట్ కోసం నాగులపాలెం గ్రామం నుండి బైకుపై పర్చూరు లోని SBI రోడ్డులో గల జిరాక్స్‌సెంటర్‌కు వచ్చి చూడగా ఈ డాక్యుమెంట్ కనిపించలేదు. కనుక నాయందు దయఉంచి ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియ పరచవలసినదిగాప్రార్థన

ఇట్లు
మొహమ్మద్ అబ్దుల్ ఖాలిక్
S/o ఇబ్రహీం ఖలీలుల్లా
నాగులపాలెం (Po) పర్చూరు (MDL)
బాపట్ల (DT)
సెల్ : **9849685091**

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 150/2024
ఇన్
ఓ.ఎస్. నెం: 91/2015

1.జంపాల సీతారావమ్మ (చనిపోయినందున) వారసులు
2. మామిళ్లపల్లి పద్మావతి,
భర్త: సుబ్బారావు, 50 సం॥,
హిందూ, గృహిణి,
నివాసం : గుర్రపుశాల గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా.
3.కేసనపల్లి శివపార్వతి, భర్త: వీరయ్య, 40 సం॥
హిందూ, గృహిణి, నివాసం: మొగుళ్లపల్లి గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా
.... పిటీషనర్స్/వాదులు
వర్సెస్
జంపాల నరసింహారావు, (చనిపోయినందున)
మరియు ఇతరులు ...... రెస్పాండెంట్స్/ప్రతివాదులు
4వ రెస్పాండెంట్
జంపాల ప్రసన్నలక్ష్మి, భర్త: లేట్ జంపాల నరసింహారావు, 53 సం॥,హిందూ, తేజ వృద్ధాశ్రమం, నివాసం: సోమవరప్పాడు గ్రామం మరియు పోస్టు, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావాను పై కోర్టునందు పిటీషనర్స్/వాదులు, రెస్పాండెంట్స్/ప్రతివాదులుపైన భాగ పంపిణీ కోరుతూ దావా దాఖలు చేసి దర్మిల 1వ ప్రతివాది అయిన జంపాల నరసింహారావు చనిపోగా Abetment set aside చేయమని పై పిటీషన్ దాఖలు చేసి నీకు అనేకమార్లు నోటీసులు పంపినప్పటికీ నీవు తీసుకొనకుండా కావాలని బుద్ధి పూర్వకంగా ఉపేక్షించినందున పై కోర్టువారు పేపరు ద్వారా నోటీసు జారీ చేసినందున నీకు తెలియపరచడమైనది. కావున పై కోర్టువారి ఎదుట తేదీ : 29-04-2024 ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారాగానీ హాజరై నీఆక్షేపణలు తెలియపరచు కోగలవు. లేనియెడల నీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడునని ఖండితముగా తెలియపరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: **29-04-2024** **కె.శ్రీనివాస్,**
శ్రీమతి కె.విజయలక్ష్మి
అడ్వకేట్స్, మార్కాపురం.
సెల్: 6303654394.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓ.ఎస్. 37/2023

బిజినేపల్లి లక్ష్మి నరసింహారావు ... వాది
వర్సెస్
మంచికంటి శ్రీనివాసరావు .... ప్రతివాది
టు,
మంచికంటి శ్రీనివాసరావు
తండ్రి: సుబ్బరాయుడు,
వయసు 65 సం॥, హిందూ, వ్యాపారం
డోర్ నెం: 6/41, నక్కా వారి వీధి,
బేస్తవారిపేట గ్రామం, (పోస్టు మరియు మండలం),
ప్రకాశం జిల్లా.

ఈనెంబరు వాది దావా ప్లెయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినందున పైదావాలో మీ ఆక్షేపణలు వినుటకు 08-05-2024వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గానీ హాజరై నీఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా : **08-05-2024** ఇట్లు
తడికమళ్ల శివప్రసాద్,
బి.ఎస్.సి., ఎల్.ఎల్.బి.,
వాది తరపు అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.151/2024
ఇన్
ఓ.ఎస్.నెం: 91/2015

1.జంపాల సీతారావమ్మ (చనిపోయినందున) వారసులు
2. మామిళ్లపల్లి పద్మావతి, భర్త: సుబ్బారావు,
50 సం॥, హిందూ, గృహిణి,
నివాసం : గుర్రపుశాల గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా.
3. కేసనపల్లి శివపార్వతి, భర్త: వీరయ్య,
40 సం॥ హిందూ, గృహిణి,
నివాసం: మొగుళ్లపల్లి గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా
.... పిటీషనర్స్/వాదులు
వర్సెస్
జంపాల నరసింహారావు, (చనిపోయినందున)
మరియు ఇతరులు ..... రెస్పాండెంట్స్/ప్రతివాదులు
4వ రెస్పాండెంట్
జంపాల ప్రసన్నలక్ష్మి, భర్త: లేట్ జంపాల నరసింహారావు, 53 సం॥,
హిందూ, తేజ వృద్ధాశ్రమం, నివాసం:
సోమవరప్పాడు గ్రామం మరియు పోస్టు, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావానుపై కోర్టునందు పిటీషనర్స్/వాదులు, రెస్పాండెంట్స్/ప్రతివాదులుపైన భాగ పంపిణీ కోరుతూ దావా దాఖలు చేసి దర్మిల 1వ ప్రతివాది అయిన జంపాల నరసింహారావు చనిపోగా ఆయన వారసులుగా నిన్ను దావా నందు 4వ రెస్పాండెంట్/ప్రతివాదిగా చేర్చమనిపై పిటీషన్ దాఖలు చేసి నీకు అనేకమార్లు నోటీసులు పంపినప్పటికీ నీవు తీసుకొనకుండా కావాలని బుద్ధి పూర్వకంగా ఉపేక్షించినందున పై కోర్టువారు పేపరు ద్వారా నోటీసు జారీ చేసినందున నీకు తెలియపరచడమైనది. కావున పై కోర్టువారి ఎదుట తేదీ: 29-04-2024 ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలియపరచుకోగలవు. లేనియెడల నీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడునని ఖండితముగా తెలియపరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా : **29-04-2024**

కె.శ్రీనివాస్,
శ్రీమతి కె.విజయలక్ష్మి
అడ్వకేట్స్, మార్కాపురం.
సెల్: 6303654394.

ప్రజాశక్తి
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

దేశాన్ని అధోగతి పాలు చేసిన

బిజెపిని, దాని పొత్తు పార్టీలను ఓడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-కొండపి

దేశాన్ని అన్ని విధాలుగా అధోగతి పాలు చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం సభ్యులతో ఎం. చిన్న బ్రహ్మయ్య అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటకు తెస్తామని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, అవినీతిని అరికడతామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగా మారాయని విమర్శించారు. గత పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి వాటిని చెత్త బుట్టలో వేసినట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను నిత్యం పెంచుతూ ప్రజల మీద మోయలేని భారాలను మోపుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బిజెపికి భజన చేస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఇండియా బ్లాక్ పేరుతో కాంగ్రెస్, వామపక్షాలు, బిజెపికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను కలుపుకొని ముందుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతు పలకాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించాలన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు పూర్తి జిల్లా అభివద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్, నాయకులు గుమళ్ల వెంకటేశ్వర్లు, మల్లెల పెద్ద పేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య సూరిబాబు, పి. శ్రీనివాసరావు ఎల్. పరిశుద్ధరావు, ఎం. చిన్న పేతురు, పుట్టా రామారావు, జి.వందనం, ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

దర్శిలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దర్శి : రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని, దాని తొత్తు పార్టీలను సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో దొనకొండ మండల కార్యదర్శి చెరుపల్లి అంజయ్య అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెట్టుబడి దారుల కొమ్ముకాస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, మతోన్మాద విధానాలను అవలంబిస్తున్న బిజెపిని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయకుమార్

గొల్లపూడి ఆదినారాయణ మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రముఖ వ్యాపారవేత్త, భారతి టింబర్ డిపో అధినేత , రంగస్థల నటుడు గొల్లపూడి ఆదినారాయణ (67) మృతి బుధవారం రాత్రి చెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని చీమకుర్తి నెహ్రూనగర్‌లోని ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం గురువారం ఉంచారు. స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గొల్లపూడి ఆదినారాయణ వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు పొందారు.నటుడుగా ఆయన మంచి పేరు గడించారు.ప్రముఖ నటీనటులతో కలిసి పలు సాంఘిక, సందేశాత్మక నాటకాలు, నాటికల్లో నటించారు.ఈ మంటలార్పండి, ఊరమ్మడి బతుకులు, పుటుక్కు జరజర డుబుక్కుమే నాటికల్లో నటించి ప్రశంశలు పొందారు.చీమకుర్తి కళాభారతి సంస్థలో సభ్యులుగా ఉంటూ నాటక సమాజాలను, కళాకారులను ప్రోత్సహించారు. ఆదినారాయణ మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు యువ పారిశ్రామికవేత్త గొల్లపూడి చౌదరి ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళు లర్పించిన వారిలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్,టిడిపి రాష్ట్ర నాయకులు అడకా స్వాములు,జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం,జి. రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, ఉన్నం సుబ్బారావు, రోటరీక్లబ్ నాయకులు పి. శ్రీనివాసమూర్తి, కాలేబు, ముప్పూరి చలమయ్య,గొల్లపూడి వెంకటరావు ఉన్నారు.

శ్రీపతి సతీష్ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-కొండపి

కాంగ్రెస్‌పార్టీ కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా శ్రీపతి సతీష్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్‌ఒ కుమార్‌కు సతీష్ తమ నామినేషన్ పత్రాలు అంద జేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధికి వైసిపి, టిడిపి చేసింది ఏమిలేదన్నారు. తనను ఆదర్శిస్తే నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

ఒకే ఒక నామినేషన్ దాఖలు

కొండపి నియోజక వర్గంలో తొలిరోజు గురువారం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయినట్లు ఆర్‌ఒ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీపతి సతీష్ ఒక్కసెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్‌ఒ తెలిపారు.

దర్శిలో ఆరు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజక వర్గంలో గురువారం ఆరు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పుట్లూరు కొండారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మీనా మంచ, వైసిపి అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రెండుసెట్లు, బూచేపల్లి నందిని రెండు సెట్లు కలిపి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని గుదివారిపాలెం సచివాలయంలో వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్న ఇనకొల్లు సామేలు, చింతగుంపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉండ్యాల కృష్ణారెడ్డి రాజీనామా చేసినటఉల ఎంపిడిఒ వెంకటసుబ్బారావు తెలిపారు. మండలం మొత్తం మీద ఇప్పటి వరకూ ఆరుగురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో వైసిపి నాయకులు

చెవిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని వైసిపి నాయకులు వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితుల గురించి చెవిరెడ్డికి వివరించారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి విజయం చేకూర్చాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించినట్లు నాయకులు తెలిపారు. చెవిరెడ్డిని కలిసిన వారిలో జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసిపి నాయకులు పాలుగుళ్ల మల్లికార్జున రెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, చెరుకుపల్లి రాధాకష్ణారెడ్డి చోడ రవిచంద్ర రెడ్డి, ఇండ్ల బాలయ్య, పులి శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

ప్రజాశక్తి-కొండపి

ప్రజలందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని అడిషనల్ డిఎస్‌పి (క్రైం) శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని అనకర్లపూడి, కొండపి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కొండపి పిఎస్ పరిధిలోలోని గ్రామాలను సందర్శించి ఓటర్లకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి సిఐ పాండురంగారావు,ఎస్ఐ కష్ణ బాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని ఎఆర్‌సి అండ్ జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.సౌజన్య తెలిపారు. పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో సిహెచ్. తులసి 967 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచినటుల తెలిపారు. బైపిసి విభాగంలో ఉప్పుటూరి సంధ్య 969 మార్కులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో పి. సాయిరాం 422 మార్కులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలోని మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ఎన్నికల కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఎన్నికల కోడ్ అమలు పరచడంలో అధికారులు నిరక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చి నెలరోజులు దాటినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. మండల కేంద్రమైన సిఎస్‌పురం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న టిడిపి జెండా దిమ్మెకు వేసి ఉన్న పార్టీ గుర్తును మూసి వేయకుండా అలాగే వదిలేశారు. అభివద్ధి పనుల పేరుతో నాయకులు ఏర్పాటు చేసిన శిలా ఫలకాల విషయంలో ఎన్నికల కోడ్ అమలు పరచలేదు. మండల పరిధిలోని రేగులచెలక పంచాయతీలో చెన్నపునాయునిపల్లి వెళ్లే దారిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ ఫొటోతో ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని మూసి వేయకుండా అలాగే వదిలేశారు. అంతర్గత రహదారులు, సిమెంట్ రోడ్ నిర్మాణం అంటూ టిడిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కదిరి బాబూరావు పేరుతో గణేషనపల్లి రామాలయం వద్ద, ప్రాథమిక పాఠశాల వద్ద, రేగుల చెలక లో పలు చోట్ల ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను మూసి వేయకుండా అలాగే వదిలి వేశారు. శిలా ఫలకాలకు, పార్టీ దిమ్మెలకు ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

సార్వత్రిక సమరం

ఎన్నికల ప్రచారంలో ఎంపి మోపిదేవి, డాక్టర్ గణేష్

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

ప్రజాశక్తి - నగరం

వైసీపీలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు ప్రజలను కోరారు. మండలంలోని సజ్జవారి పాలెం, చిరకాలవారిపాలెం, బోరమాదిగపల్లి, బెల్లంవారి పాలెం, న్యూ అంబేద్కర్ నగర్, ఏలేటిపాలెం గ్రామాల్లో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు. ఎంఎల్ఎ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు.

యడం బాలాజీకి మద్దతు తెలుపుతున్న వలపర్ల వాలంటీర్లు

బాలాజీకి మద్దతుగా వాలంటీర్లు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వాలంటీర్ల మీద రాజకీయ కోణంతో ఆరోపణలు చేస్తున్న కూటమి నాయకుల మాటలకు మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నట్లు వాలంటీర్లు పేర్కొంటున్నారు. మండలంలోని వలపర్ల సచివాలయ పరిధిలోని 33 మంది వాలంటీర్లు తమ పదవులకు గురువారం రాజీనామాలు చేసి మార్టూరు ఎంపిడిఓ గొరికపూడి నితిన్‌కి అందజేశారు. అనంతరం వలపర్ల వైసిపి నాయకులు షేక్ అజీమ్, తన్నీరు అంకమ్మరావు, తవ్వా రవి ఆధ్వర్యంలో పర్చూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీని చీరాల కార్యాలయంలో కలిసి తమ మద్దతు ప్రకటించారు.

పొదిలి : నగర పంచాయతీలోని వాలంటీర్లు గురువారం మూకుమడిగా రాజీనామాలు చేశారు. కంబాలపాడులో వాలంటీర్లుగా పని చేస్తున్న కర్ణ శ్రీనివాస్, కల్లూరి కృష్ణారెడ్డి, టి శిరీషరెడ్డి, కోవెలకుంట్ల వెంకటేశ్వర్లు, అంబటి రఘు రామిరెడ్డి, అంబటి లక్ష్మి స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలు ఎంపీడీఓకు అందించారు. 3వ సచివాలయంలో వాలంటీ షేక్ షాహినా, మాదాలవారిపాలెంకు చెందిన గుంటూరు అనురాధ, 1వ సచివాలయంలోని ఏడుగురు వాలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న బిఎస్‌పి అభ్యర్థి

బిఎస్‌పి అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ తెలిపారు. తొలి రోజు బిఎస్‌పి అభ్యర్థి తుమ్మలూరి వెంకటరత్నం తన నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం ఎఆర్‌ఒలు సిహెచ్ సుబ్బయ్య, కె సంధ్యశ్రీ, నాగరాజు, మెహర్ బాబు, ఎం ప్రమీల, ఫణీంద్ర బాబు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనకు చివరి రోజులు

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, దుర్మార్గపు అరాచక పాలనకు ఇవే చివరి రోజులని, ప్రజలంతా జగన్‌ను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో వలపర్లకు చెందిన యువత ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో గురువారం టిడిపిలో చేరారు. కోటి ఆశలతో అధికారం ఇచ్చిన ప్రజలకు సీఎం జగన్ గత ఐదేళ్లుగా విధ్వంసం, అరాచకం, దౌర్జన్యం, దోపిడి చేసి చూపించాడని మండిపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశాడని ఆరోపించారు. ఓటు అనే వజ్రాయుధంతో దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిన యువకులు

సిద్ధమయ్యారని అన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్షేమ రాజ్యం వస్తుందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతుందని అన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి కొత్త శోభ సంతరించు కుంటుందని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చంద్రబాబు ప్రత్యేక ప్రణాళిక చేశారని అన్నారు. ఆయన అనుభవం, మేధా సంపత్తి, ముందు చూపుతో యువత భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని అన్నారు. వైసీపీ శ్రేణులు టిడిపి వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. ఆత్మగౌరవం కోసం టిడిపిలోకి రావాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

వలపర్ల గ్రామానికి చెందిన యువత ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరారు. ఏలూరి ఆప్యాయత, చేసిన అభివృద్ధి, భవిష్యత్తు కోసం టిడిపిలో చేరుతున్నట్లు కుంచాల వెంకటేష్, తన్నీరు బాలగౌతమ్, గుంజి ధనమూర్తి, తన్నీరు వెంకయ్య, తన్నీరు గురుప్రసాద్, తన్నీరు ఆకాష్, తన్నీరు శివ, తన్నీరు అశోక్, కుంచపు ఈశ్వర్, పల్లపు సుబ్బారావు, తన్నీరు అనిల్, కుంచాల లక్ష్మయ్య, కుంచాల సాయి వెంకటేష్, గుంజి పవన్ పేర్కొన్నారు.

ఆనందబాబు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కొల్లూరు

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

మండలంలోని జువ్వల పాలెం, తడికలపూడి, కిష్కింద పాలెం గ్రామాల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తాను వేమూరు నుండి నాలుగో సారి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తాను ఇక్కడ వ్యక్తినేనని, మీ మనిషినని అన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఇక్కడ వ్యక్తి పనికిరాక వేరే జిల్లా నుంచి తీసుకొచ్చి ఇక్కడ పోటీకి పెట్టారని అన్నారు. తాను ఎప్పటికీ మీ వాడినేనని అన్నారు. గ్రామాల్లో తాను చేసిన అభివృద్ధి తప్ప వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత క్రొత్తగా ఏమన్నా అభివృద్ధి జరిగిందాని ఆయన అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల కోసం ఉన్న 27పథకాలు రద్దు చేశాడని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగనన్న విదేశీ విద్యని పెట్టుకున్నాడని అన్నారు. జనసేన ఇన్‌ఛార్జి ఊస రాజేష్, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత అధికార ప్రతినిధి కనకాల మధుసూధన ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు బొందలపాటి చలమయ్య పాల్గొన్నారు.

అశోక్ బాబు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - వేమూరు

పల్లికోన ప్రచారంలో అశోక్ బాబుతో నాయకులు

మండలంలోని పల్లికోన గ్రామంలో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక బాబు గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. దీనిలో భాగంగా శ్రీరామ నవమిని సందర్భంగా గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమర్తలూరు ఎస్టీ కాలని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేమూరులో వైసిపి నాయకులు మెరీస్ బాబు కుమారుని వివాహ వేడుకలకు అశోక్ బాబుతో పాటు బాపట్ల ఎంపి అభ్యర్థి నందిగం సురేష్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. భట్టిప్రోలు ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసిటి ఉదయ్ భాస్కరి, వైసీపీ మండల కన్వీనర్ మొర్లా శ్రీనివాసరావు, పల్లికోన సర్పంచ్ బుల్లెద్దు రాజమ్మ ప్రతాప్, ఆలమూడి సర్పంచ్ రాంబాబు, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

ఆనందబాబు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో సాయిబాబా

టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ టిడిపి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో గ్రామ నాయకులు అధిక పాల్గొని ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో నెలకొన్న అనిచితి, అరాచకాల నుండి కాపాడుకునేందుకు టిడిపిని గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఉమ్మడి మేనిఫెస్టో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో దోహదపడుతుందని అన్నారు.

ఎన్నికల్లేకుండా చేసింది రఘుపతే

టిడిపి అభ్యర్థి నరేంద్రవర్మ ఆరోపణ

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

పురపాలక సంఘం ఎన్నికలు జరగకుండా అడ్డు పడి, మున్సిపల్ కమిషనర్ ద్వారా ఏకపక్ష నిర్ణయాలతో ఎంఎల్ఎ కోనరఘుపతి అనేక అవక తవకలకు పాల్పడ్డారని టిడిపి ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి చెందకుండా అడ్డు పడ్డారని విమర్శించారు. మున్సిపాలిటీలో గ్రామాల విలీనం పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రజలను దూరం చేశారని అన్నారు. గ్రామీణ ప్రజలకు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని దూరం చేసి వైసీపి ప్రభుత్వం పేదల పొట్టకొడుతోందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యథాతథంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. గత తొమ్మిది దఫాలుగా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించిన సాంప్రదాయాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఎంఎల్‌సి అన్నం సతీష్ తన పదవీ కాలంలో ప్రజలకు తాగునీరు, సాగునీరు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని గుర్తు చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయ సేకరణతోనే విలీన ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ తనకు నరేంద్రవర్మకు మధ్య ఎలాంటి విభేదాల్లేవని చెప్పారు. పాతికేళ్లుగా తామిద్దరూ మంచి మిత్రులమని అన్నారు. పదిహేనేళ్లుగా వ్యాపార భాగస్వాములుగా కలిసి పని చేశామని అన్నారు. జనంలో వచ్చే అపోహలకు నరేంద్ర వర్మను గెలిపించి ఫుల్ స్టాప్ పెడతామని అన్నారు. తాను రెండు సార్లు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సంగతిని గుర్తు చేశారు. మూడోసారి తన మిత్రుడు వేగేశన నరేంద్ర వర్మను ఎంఎల్ఎగా గెలిపించి తనకు గొప్ప బహుమతిగా ఇవ్వాలని ప్రజలను కోరారు. సాగు నీరు విషయంలో నీటి పారుదల శాఖా మంత్రిని ఘెరావ్ చేసి రైతుల పక్షపాతిగా నిలిచిన సందర్భాన్ని గుర్తుచేశారు. నరేంద్రవర్మ మంచి వ్యక్తిత్వం గల సమాజ సేవకుడని అన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపించుకోవాలని కోరారు. ఎంపీగా తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను గెలిపించాలని అన్నారు. సమావేశంలో జనసేన ఇన్‌ఛార్జి నామన శివన్నారాయణ, టిడిపి నాయకులు తాత జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

బాలాజీ సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపిలోకి ఆహ్వానిస్తున్న యడం బాలాజీ

మండలంలోని నూతలపాడు తెలగపాలెంకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు విన్నుకోట వీరశంకరరావు, పాతేళ్ల శ్రీనివాసరావు, గణిపిశెట్టి చిరంజీవి, గణిపిశెట్టి కోటేశ్వరరావు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి బాలాజీ సమక్షంలో వైసీపీలో గురువారం చేరారు. వీరికి వైసిపి కండువా కప్పి బాలాజీ సాధరంగా ఆహ్వానించారు.

సార్వత్రిక సమరం

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా : గొట్టిపాటి

ప్రజాశక్తి-కురిచేడు

తనను ఆదరిస్తే మండలాన్ని అభివృద్ధి చేస్తానని టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన కురిచేడులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మం గారి గుడి మీదుగా టిడిపి కార్యాల యానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో అయ్యప్ప స్వామి గుడి, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ కాలువ ప్రక్కనే ఉన్నా కురిచేడు మండలంలో తాగు నీటి సమస్య అధికంగా ఉందన్నారు. సాగు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పంటలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైసిపి పాలనలో అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోయినట్లు తెలిపారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టిడిపి మండల అధ్యక్షుడు నెమలయ్య, మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలీ, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, పావులూరి కోటిలింగం, కిలారి కొండయ్య, వైద్యవిభాగం కార్యదర్శి డాక్టర్ సునీల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి : దర్శి నగరపంచాయతీ పరిధిలోని సందువారిపాలెంలో కాపు కళ్యాణ మండపం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత రామాలయం గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందు ఎర్రయ్య, కర్ర శ్రీను, చిమ్మా శ్రీను టిడిపిలోకి చేరారు. గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, శోభారాణి, తిండి నారాయణరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ స్వామి నామినేషన్

ప్రజాశక్తి-శింగరాయకొండ, కొండపి

టిడిపి కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. తొలుత టంగుటూరు మండలం వల్లూరమ్మ గుడిని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా టంగుటూరుకు చేరుకుంటారు. అక్కడ నుంచి కొండపి తహశీల్దారు కార్యాలయానికి చేరుకొని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. అనంతరం కొండపిలో టిడిపి ఆధ్వర్యంలో భారీ సభ ఏర్పాటుకు సిద్ధం చేశారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఈ పాటికే కొండపి, శింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లో టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, దామచర్ల సత్య కోరారు.

గిద్దలూరులో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో టిడిపి కూటమి గిద్దలూరు నియోజక వర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి మద్దతుగా ఆయన సతీమణి పుష్పలీల గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో గిద్దలూరు పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి గిద్దలూరు నియోజక వర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ముత్తుముల పుష్పలీల

ప్రచారానికి వెళ్లి .. పురుడు పోసి..

ప్రజాశక్తి-దర్శి

ఎన్నికల ప్రచారం కన్నా ప్రజల ప్రాణాలే ముఖ్యమని టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని అబ్బాయి పాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతూ స్థానిక ఎస్-ఎస్ఆర్ ఆసుపత్రిలో చేరింది. ఆసమయంలో వైద్యశాలలో వైద్యులు అందుబాటులో లేరు. అదే సమయంలో కురిచేడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి ఆసుపత్రి నుంచి సమాచారం అందించారు. దీంతో ఆమె మధ్యలోనే ప్రచారాన్ని నిలుపుదల చేసి దర్శికి వచ్చి వెంకటరమణకు ఆపరేషన్ చేసి పండంటి మగ బిడ్డకు పురుడు పోశించింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వృత్తి రీత్యా వైద్యురాలు అయిన తాను ప్రజల ప్రాణాలు కాపాడటమే తన బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మికి వెంకటరమణ కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.

గర్భిణికి ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీసిన డాక్టర్ లక్ష్మి

డాక్టర్ దద్దాల నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-కనిగిరి

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఒక సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు గురువారం అందజేశారు. తొలుత దద్దల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, కనిగిరి నియోజకవర్గ పరిశీలకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది రామణ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈనెల 25న వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనునట్లు సమాచారం.

నామినేషన్ అందజేస్తున్న డాక్టర్ దద్దాల

పేదల సంక్షేమమే ధ్యేయం : కరణం

ప్రజాశక్తి-చీరాల

పేదల సంక్షేమమే ధ్యేయమని వైసిపి చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ తెలిపారు. చీరాల నవాబ్ పేటకు చెందిన పలువురు ముస్లిములు కరణం వెంకటేష్‌ను గురువారం కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. వేటపాలెం మండలం కొత్తపేటలో కరణం వెంకటేష్ మద్దతుగా ఆయన సతీమణి కరణం గీత, గోరంట్ల సుధారాణి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కో ఆప్షన్ మెంబర్ షేక్ కబీర్, రామకృష్ణశర్మ, పి. వెంకటేశ్వర రెడ్డి, అబ్దుల్, రాజు, జుబేల్, తోట శంకర్, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత రాజశేఖర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవి, 10వ వార్డు కౌన్సిలర్, క్లస్టర్-2 మహిళా అధ్యక్షురాలు గోలి స్వాతి రవి, జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి, చీరాల మండల మహిళా అధ్యక్షురాలు శీలం వెంకటేశ్వరమ్మ, మైనారిటీ సెల్ షేక్ మస్తాన్,అమర్తపూడి రమాదేవి, వాసిమల్ల బ్రదర్స్, హరూన్ నబీఖాన్, రహంతుల్లా, ఖాదర్ బాషా, షేక్ హుస్సేన్, సయ్యద్ హుస్సేన్, పఠాన్ కరిముల్లా పాల్గొన్నారు.

వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న నాయకులు

స్వర్ణోదయ కాలనీ వాసుల మద్దతు

విధంగా వేటపాలెం మండలం స్వర్ణోదయ కాలనీ వాసులు కప్పల హేన, మాజీ వార్డు మెంబర్ తేళ్ల నరసింహ, తేళ్ల కోటయ్య, అనపర్తి ఏసుబాబు, అనపర్తి రవి, బోడిపోగు సురేష్, తప్పెట రవి, దూరపల్లి ఆకాష్ తదితరులు వైసిపి చీరాల నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు.

టిడిపిలో చేరిన వారితో దామర్ల సత్యనారాయణ

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ గ్రామానికి చెందిన నాగరాజు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు గురువారం టిడిపిలో చేరారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. దామచర్ల సత్యనారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో బిఎన్. విజయకుమార్

బిఎన్ సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు గురువారం టిడిపిలో చేరారు. టిడిపి సంతనూతలపాడు నియోజక అభ్యర్థి విజయకుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పరిధిలోని పోతవరం గ్రామంలో కాంగ్రెస్ మరియు వైసిపి మండల మాజీ అధ్యక్షుడు దివి పున్నారావు, మాజీ ఎంపిపి దివి రంగవల్లి దంపతులు, మరో వంద కుటుంబాల వారు విజయకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా చీర్వానుప్పల పాడు పంచాయతీ పరిధిలోని అగ్రహారం గ్రామంలో పొద శ్రీధర్, ఆయన అనుచరులు టిడిపిలో చేరారు. ఓబన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ఒక్కంటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాదు, పోలినేని సింగారావు ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మి వరప్రసాదు, మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు షేక్ ఖాజావలీ, టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్ , మండల మహిళా నాయకురాలు గూడూరి ఝాన్సీ జాన్సన్ ,సెల్వం, నార్నె అంజయ్య, పొద వరప్రసాదు, గూడూరి హనుమంతరావు పాల్గొన్నారు.

నామినేషన్ అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొండారెడ్డి

కొండారెడ్డి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-దర్శి

జాతీయ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టూరు కొండారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపిని ఓడించేది కాంగ్రెస్ పార్టీ ఒకటేనని తెలిపారు. అందుకోసం ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లారెడ్డి, ఎలీషా, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

22న ఆదిమూలపు సురేష్ నామినేషన్

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 22న తాను నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో వైసిపి కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఈనెల 22న శింగరాయకొండలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కొండపి తహసిల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి మండల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి హరిబాబు, పుట్టా వెంకట్రావు, బత్తిన మదనమనోహర్, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

కొండపి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కొండపి-కట్టావారిపాలెం గ్రామాల మధ్యకున్న హ్యాపి కిడ్స్ స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి అగ్నిమాపక అధికారి వెంకటరావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణను ప్రయోగాత్మకంగా చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మద్దిపాడు : మద్దిపాడులోని ముస్లిం, బీసీ, ఎస్సీ కాలనీలో బాబు షూ్యరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్. విజయకుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, నాయకులు ఆడక స్వాములు, మాజీ సర్పంచి ఉప్పగుండూరి నాగేశ్వరరావు , కడియాల రఘు బాబు, జనసేన మండల అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం, నవులూరు శివకష్ణ, చుంచు హరిబాబు పాటిబండ్ల చెంచయ్య, షేక్ అబ్దుల్ హకీమ్ , షేక్ దౌలత్ పాల్గొన్నారు.

విజేష్‌రాజ్‌కు బి ఫారం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాలపర్తి విజేష్ రాజ్ ఆంధ్ర ప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి చేతుల మీదుగా గురువారం బి ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా విజేష్ రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధిష్టానానికి, వైఎస్.షర్మిల రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

బిఎస్‌పి అభ్యర్థి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-చీమకుర్తి

బిఎస్‌పి సంతనూతలపాడు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కైలా వెంకటరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ,జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

దిగజారుతున్న ధరలు

- తగ్గిన దిగుబడి
- ఆందోళనలో మిర్చి రైతులు

ప్రజాశక్తి-పిసిపల్లి

రోజు రోజుకు మిర్చి ధరలు దిగజారి పోతున్నాయి. దీంతో రైతులు కుదేలు అవుతున్నారు. గతేడాది కొద్దిపాటి ధరలు పలకడంతో ఆశపడిన రైతులు ఈ ఏడాది విరివిగా మిర్చి సాగు చేశారు. ధరలు రోజురోజుకు తగ్గుతూనే ఉన్నాయి. గత వారం క్వింటా మిర్చి రూ.13వేలు పలికింది. ప్రస్తుతం రూ.8 నుంచి రూ.9 వేలకు దిగజారింది. తేజ రకం మిర్చి కూడా క్వింటా రూ.18 వేలకు మించి పలకడం లేదు. ఫలితంగా రైతులు అప్పుల్లో మునిగిపోయారు. ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పించడం లేదు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. మండలం మొత్తం మీద నీటి సౌకర్యం ఉన్న రైతులు తనకున్న పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశారు. సుమారు మూడు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఒక్కొక్క రైతు 15 ఎకరాల మేర పంట సాగు చేశారు. మార్చిలో క్వింటా మిర్చి రూ.15 నుంచి రూ.16 వేలు పలికింది. ప్రస్తుతం రూ.9 వేల మించి అమ్ముడు పోవడం లేదు. దీంతో నష్టాలు తప్పవని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రూ.18 వేలకు మించి ధర పలకడం లేదు

ఆలూరి కొండారెడ్డి, రైతు, అన్నపురెడ్డిపల్లి

ఎకరానికి రూ.1.20 లక్షల వరకూ పెట్టుబడి పెట్టి తేజ రకం మిర్చి ఐదు ఎకరాల్లో సాగు చేశా. మిరప కాయలు కోసేందుకు కూలీల ఖర్చు అదనం. తొలికోత నాటికి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండు, మూడు కోతలకు మరో లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. దిగుబడి మాత్రం నామ మాత్రంగా ఉంది. గతంలో క్వింటా రూ.25 వేలకు పైగా ధర పలికిన తేజ రకం మిర్చి ప్రస్తుతం రూ.18 వేలకు మించి అమ్ముడు పోవడం లేదు. ఫలితంగా నష్టం తప్పేలా లేదు.

ఎకరానికి రూ.2 లక్షల పెట్టుబడి

మోతుకూరి నరేంద్ర, సర్పంచి

నీటి సౌకర్యం ఉన్న పొలానికి ఎకరానికి రూ.20వేలు వంతున కౌలు చెల్లించి పది ఎకరాల్లో 1081 కుభేర ఆర్మూర్ రకం మిర్చి సాగు చేశా. ఒకొక్క మిర్చి మొక్క రూ.2 చొప్పున కొను గోలు చేశా. మొదటి కాపు కోసే నాటికి అన్ని రకాల పెట్టుబడులు, కూలీలు కలుపుకొని ఎకరానికి రెండు లక్షల మేర ఖర్చు అయ్యింది. ఎకరానికి 20 క్వింటాళ్ళకు మించి దిగుబడి రాలేదు. మొదట్లో రూ.12వేలు పలికిన క్వింటా మిర్చి ధర ప్రస్తుతం రూ.9 వేలకు మించి అమ్ముడు పోవడం లేదు. దీంతో నష్టం తప్పేలా లేదు. అప్పులు చేసి వ్యవసాయం సాగు చేసే నష్టం వస్తోంది. ఏమి చేయాలలో అర్థం కావడం కావడం లేదు.మిర్చి సాగు చేయాలో వదిలేయాలో పాలు పోవడం లేదు.

చేపల కోసం నీరు బయటకు..

- ట్యాంకర్లకు నీరు అమ్మకం
- ఎండిన చెరువులు
- పశుపోషకుల అవస్థలు
- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు

కనుమళ్ల చెరువు నుంచి నీరు తరలిస్తున్న ట్యాంకర్

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారుల కాసులకు కక్కుర్తి పడి చెరువులను ఎండబెట్టారు. దీంతో నీటి కోసం పశు పోషకులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారుల, వైసిపి నాయకులు తమ జేబులు నింపుకునేందుకు చెరువులు ఎండబెట్టారు. నీటితో పాటు చెరువులోని మట్టిని సైతం అమ్ముకునే పనిలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

మండల పరిధిలోని పాకల, బింగినపల్లి, సోమరాజుపల్లి, కలికివాయ, కనుమళ్ల గ్రామపంచాయతీల్లో ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. పాకల, సోమరాజుపల్లిలో మొత్తం ఆరు చెరువులు ఉన్నాయి. బింగినపల్లిలో పెద్ద చెరువు ఉంది. ఆ చెరువులోని చేపలకు మంచి డిమాండ్ ఉంది. ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చెరువులో చేపలను అమ్మకాలు చేపట్టి తమ జేబులు నింపుకున్నారు. పంచాయతీ ఆదాయానికి గండి కొట్టి ఆ డబ్బును నాయకులు నొక్కేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్ చెరువుల్లో చేపలు పట్టుకొనేందుకు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించాల్సి ఉంది. వైసిపి నాయకులు గ్రామపంచాయతీ అధికారులతో కుమ్మక్కై, సర్పంచుల మద్దతుతో చెరువులోని చేపలను అమ్మారు. పాకల చెరువులో చేపల అమ్మకం ద్వారా సుమారు రూ.10 లక్షలు, బింగినపల్లి చెరువులో సుమారు రూ.25 లక్షల మేర చేపల అమ్మకం ద్వారా వచ్చినట్లు సమాచారం. చేపలు పట్టే సమయంలో ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు చేపలు పట్టుకునేవారితో రాయబారాలు నడిపి తమ జేబులు నింపుకున్నట్లు తెలిపారు. చేపల పట్టుకొనే విషయం గురించి వైసిపి నాయకులు ప్రశ్నిస్తే గ్రామానికి చెందిన పెద్ద నాయకుడది నగదు ముట్టుచెప్పినట్లు చెప్పి వారికి తలా రెండు కేజీల చొప్పున చేపలు ఇచ్చి పంపతున్నారు. చేపలు పట్టేందుకు చెరువుల్లోని నీటిని బయటకు పంపారు. ఫలితంగా పశు వుల దాహర్తీ తీర్చేందుకు నీరు లేకుండా పోయింది. అధికారుల సహాయ సహకారాలు, గ్రామ వైసిపి నాయకులతో సహాయంతో కనుమళ్ల చెరువులోని నీటిని కూడా అమ్ముతున్నట్లు ప్రచారం జరుగుతోంది. చేపల కోసం చెరువుల్లోని నీటిని బయటకు పంపుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. సోమరాజు పల్లి, కలికివాయి గ్రామపంచాయతీలో కూడా ఇదే పరిస్థితి ఉది. పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లో అరకొరగా సాగు చేసిన వరి పంటకు పూర్తిస్థాయిలో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసిపి నాయకుల కక్కుర్తి కారణంగానే చెరువుల్లో చేపలు పట్టుకొనేందుకు నీటిని బయటకు పంపడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులోని నీటిని వృథాగా బయటకు పంపుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోడం పట్ల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో పట్టిన చేపలు

చెరువులోని నీటిని బయటకు పంపుతున్న దృశ్యం

మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

టోల్‌ప్లాజా కార్మికులకు తగిన గుర్తింపు ఇవ్వాలి: సిఐటియు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లాలో వివిధ టోల్‌ప్లాజాలలో పనిచేస్తున్న కార్మికులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేసింది. టోల్‌ప్లాజా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులుగా గుర్తించాలని కోరింది. టంగుటూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం గురువారం ఒంగోలులోని సిఐటియు కార్యాలయంలో టంగుటూరు రాము అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడారు. జిల్లాలో ఉన్న నాలుగు టోల్‌ప్లాజాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులను సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ప్రయివేటు లిమిటెడ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. టోల్‌ప్లాజాలలో గత పదేళ్ల నుంచి కార్మికులు పనిచేస్తున్నా వారికి చాలీచాలని వేతనాలు అమలు అవుతున్నాయని, కనీస వసతులు లేవని, మంచినీటి వసతి లేదని, రెస్టారెంట్లు లేవని చెప్పారు. రాబోయే రోజుల్లో కార్మికులంతా ఐక్యంగా ఉండి సమస్యలమీద పోరాడాలని సమావేశంలో నిర్ణయించారు. సిఐటియు అనుబంధంగా కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకొని పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కాశీ విశ్వనాథ్, శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే

పథకాలు అందించింది వైసిపి ప్రభుత్వమే..

16వ డివిజన్‌లో బాలినేని ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రచారంలో బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే తీసుకొచ్చి లబ్ధిదారులకు నేరుగా అందించింది వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వమేనని, అలాంటి ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం స్థానిక 16వ డివిజన్ పోతురాజుపాలెం, బాలాజీనగర్ ప్రాంతాలలో 'మన ఒంగోలు.. మన వాసన్న' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, ఆయా పథకాలు నేరుగా మధ్యవర్తులు లేకుండా వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులకే చేర్చడం జరిగిందని చెప్పారు. సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమని చెప్పారు. గత ఐదేళ్లకాలంలో ఒంగోలులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా 22 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. 2024లో గెలిచిన తరువాత ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం, వైసిపి నగర అధ్యక్షులు కటారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక..

నగరానికి చెందిన పలువురు టిడిపి, జనసేన కార్యకర్తలు గురువారం వైసిపిలో చేరారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి నగర అధ్యక్షులు కటారి శంకర్, బొమ్మినేని మురళి, బాలిశెట్టి నాగేశ్వరరావు వెంగమాంబ శ్రీను ఆధ్వర్యంలో తెలుగుయువత మాజీ అధ్యక్షులు పమిడి రమేష్ అనుచరులు రఫీ, శ్రీరామ్, ఏడుకొండలు, శ్రీనివాసులు, కిరణ్, నాగరాజు, మహేంద్ర, తదితరులు వైసిపిలో చేరారు.

నామినేషన్ కేంద్రాల వద్ద

పటిష్ట బందోబస్తు

ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్పీ వకుల్ జిందాల్

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు పాటించవలసిన ఎన్నికల నియమావళి గురించి జిల్లా ఎస్పీ వివరించారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు మరియు ఒక పార్లమెంటు స్థానానికి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ఊరేగింపులలో పాల్గొనే అభ్యర్థులు, వారి సానుభూతిపరులు ఎన్నికల సంఘం విధివిధానాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా సహకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసెంబ్లీలో ఐదోసారి అడుగుపెట్టేందుకే.?

(మొదటిపేజీ తరువాయి)

రవికుమార్‌ను 2009లో అద్దంకి నియోజకవర్గం నుంచి పోటీలో నిలిపారు. కొత్త నియోజకవర్గమైనా ఇక్కడా ఊహించని రీతిలో విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించారు. ఈ నియోజకవర్గంలో ఉత్కంఠభరిత పోటీ ఉంది. రాజకీయంగా ప్రత్యర్థుల రీత్యా ఇక్కడ ఏ పరిణామం జరిగినా రాష్ట్రస్థాయిలోనే చర్చ సాగేది. 2014 వరకూ కాంగ్రెసు ప్రభుత్వం ఉన్నందున అధికారంలోనే కొనసాగారు. రాష్ట్ర విభజన జరిగాక రాజకీయ పరిస్థితులూ మారిపోయాయి. తాను ప్రాతినిత్యం వహిస్తోన్న కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. 2014 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరారు. ఇక్కడా ఆయన సునాయాసంగా గెలిచారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఇక్కడ తెలుగుదేశం నుంచి పోటీ చేసిన సీనియర్ నేత కరణం బలరాంకూ, గొట్టిపాటికి మధ్య గతంలో ఉన్న రాజకీయ వైరుధ్యాల రీత్యా నియోజకవర్గం రాజకీయంగానూ హాట్‌హాట్‌గానే నడిచింది. ఇద్దరి మధ్య ప్రచ్ఛన్నయుద్ధం మొదలైంది. జడ్పీ ఎన్నికలు, సాగర్ కాలువలపై పర్యటన సమయంలోనూ, తర్వాత ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఆయనపై ప్రత్యర్థులు దాడి యత్నం చేశారు. కారు ధ్వంసమైంది. కలెక్టరేట్ వద్దనే బైఠాయించారు. ఆ సంఘటన ఆ రోజు తీవ్ర సంచలనంగా మారింది. వీటి నుంచి ఆయన తప్పించుకున్నారు. అద్దంకి రాజకీయాలు మళ్లీ మార్టూరు తరహాకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. గొట్టిపాటి గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలపై ప్రభుత్వం నుంచి వేధింపులు మొదలయ్యాయి. అయితే ఎంతో సంయమనంతో గొట్టిపాటి నడిచారనేది విశ్లేషణ. ఆయనపై అన్ని రకాలుగా ఒత్తిళ్లు పెరిగాయి. ఒక దశలో తర్జనభర్జన పడ్డారు. అదే సమయంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పేరుతో సాగిన ఫిరాయింపుల్లో గొట్టిపాటి రవికుమార్ తెలుగుదేశంలో చేరారు. అప్పటివరకూ తానున్న పరిస్థితుల రీత్యా తన సన్నిహితులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశంలోకి చేరాక ఇక్కడ నియోజకవర్గంలో అన్ని రకాలుగా పగ్గాలు అప్పగించారు. అయినా అనేక సందర్భాల్లో ఇరు వర్గాల నడుమ పెత్తనం కోసం ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పార్టీ వేదికల్లోనూ గొట్టిపాటి-కరణం వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఒంగోలులో పార్టీ సమావేశంలో రసాభాస నడిచింది. అద్దంకి నియోజకవర్గంలో గట్టి పట్టు సాధించిన గొట్టిపాటి తిరిగి 2019 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ చేసి గెలిచారు. అద్దంకిలోనే మూడు సార్లు గెలిచారు. సీనియర్ నేత కరణం బలరాం, మరో సీనియర్ నేత బాచిన చెంచుగరటయ్యలపై గెలిచి అరుదైన రికార్డు సృష్టించారు. అయితే 2019లో అధికారం మారాక మళ్లీ గొట్టిపాటికి గతంలో వచ్చిన ఇబ్బందులే వచ్చాయి. పార్టీ మారాలనే ఒత్తిళ్ల వచ్చాయనే చర్చ ఉంది. అయినా ఆయన పదేపదే పార్టీలు మారడం సరికాదనే భావనతో తెలుగుదేశంలోనే కొనసాగారు. గ్రానైట్ ఫ్యాక్టరీలపై మైనింగు అధికారులు దాడులు చేశారు. వాటిని మూసేసేలా చేశారు. క్వారీలను లాగేసుకున్నారు. సుమారు రూ.150 కోట్లు విలువైన ఫ్యాక్టరీ సామగ్రి తుప్పుపట్టింది. వందలాది కార్మికులకు ఉపాధి పోయింది. ఆయన ఆర్థిక మూలాలను తీవ్రంగా దెబ్బకొట్టారు. గొట్టిపాటి సుప్రీంకోర్టు వరకూ వెళ్లి ప్రభుత్వంపై పోరాడారు. ఆయనకు తీర్పు అనుకూలంగా వచ్చింది. ఇప్పటికీ ప్రభుత్వం ఆయనపై కక్షకట్టింది. తెలుగుదేశంలోనూ ఆయన తిరుగులేని నేతగా ఎదిగారు. ఉమ్మడి ప్రకాశంలో కీలకంగా మారారు. ఇతర నియోజకవర్గాల్లోనూ ఆయనపాత్ర అవసరమైంది. జిల్లాలో జరిగిన మహానాడు విజయవంతంలోనూ, లోకేష్ పాదయాత్రలోనూ గొట్టిపాటి పాత్ర కీలకంగా ఉంది. అద్దంకిలో లోకేష్ పాదయాత్ర సభకు వచ్చిన జనం నియోజకవర్గ చరిత్రలోనే ఓ మైలురాయిగా నిలిచిందని చెబుతున్నారు. ఇక అసెంబ్లీలోనూ అనేక సమస్యలపై ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానాలు రాబట్టారు. అసెంబ్లీలోనూ రోల్‌మోడల్‌గా నిలిచారు. ఉమ్మడి ప్రకాశంలో పార్టీ నేతలందరూ యువకులుగా ఉన్నారు. అందరూ ఒక జట్టుగా సాగడంలోనూ గొట్టిపాటి పాత్ర చెప్పాల్సిన అవసరం లేదు. నియోజకవర్గంలోనూ అధికారంలో ఉన్నా, లేకున్నా అందరికీ అందుబాటులో ఉన్నారు. పెళ్లిళ్ల నుంచి ఏ చిన్న కార్యక్రమం జరిగినా వెళ్లడం ఈయనున్నుంచే ప్రారంభమైంది. ఇలా ప్రతి ఊరిలో కుటుంబాలతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్నారు. ఇదే ఆయన వరుస విజయానికి బాటలు వేశాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అద్దంకిలో గెలుపు ఎవరిది అనేదానిపై ఇప్పటికే అనేక సర్వేల సారాంశం ఏమిటో తెలిసిందే.. ఈ సందర్భంగా అద్దంకిలో భారీ ర్యాలీకి సన్నాహాలు చేస్తున్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా అజెండాను ముందుకు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం పోరాడుతోందన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నియంతృత్వ పోకడలకు పోతూ ఆ విషయాలను ఎప్పుడో విస్మరించాయని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు, కడప ఉక్కు కార్మాగారం ఏర్పాటు కోసం సిపిఎం పోరాటాలు చేస్తోందన్నారు. మతోన్మాద బిజెపి పార్టీతో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకున్నాయని, వైసిపి దానితో అంటకాగుతోందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజ్యాంగంలోని కీలకమైన అంశాలను రక్షించుకోవాల్సి ఉందన్నారు. సిఎఎపై చట్టం చేసేందుకు బిజెపి గజిట్ విడుదల చేసిందన్నారు. దీనిమీద వైసిపి, టిడిపి, జనసేన వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి చూపేందుకు మెగా డిఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.ఐదు వేలు చెల్లించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతింటున్న నేపథ్యంలో పంటకు మద్దతు ధర కల్పించాలని కోరారు. కౌలురైతులకు కార్డులు ఇచ్చి, వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు 200కు చేర్చి పట్టణ ప్రాంతాల్లో కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కనీస వేతనం ఇరవై ఆరు వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ బిజెపి తీసకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసరాలను రేషన్ షాపుల ద్వారా అందించాలని కోరారు. దళిత, గిరిజనులకు రక్షణ కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ప్రారంభించాలని కోరారు. బడ్జెట్‌లో, విద్యావైద్యానికి ఎక్కువ శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రజల అజెండా రానున్న ఎన్నికల్లో చర్చకు రావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, దానితో జతకడుతున్న టిడిపి, జనసేన కూటమి, నిరంకుశ వైసిపిని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో సిపిఎం ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని, వారికి ప్రజలు మద్దతిచ్చి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రధాన సమస్యలపై సమాధానం చెప్పి వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. జిల్లా వెనుకబాటుకు కారణాలు, పరిశ్రమలు ఏర్పాటు, ఉపాధి కల్పన, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, సాగుభూమి పంపిణీ, రైతాంగ సమస్యలు, గిట్టుబాటుధరలు, ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్య, తాగునీటి సమస్య పరిష్కారం, వైద్యపరమైన ఇబ్బందులు, ఉన్నత విద్యాలయాల ఏర్పాటు, ప్రజా రవాణా మెరుగుదల, మౌళిక సదుపాయాల కల్పన, జిల్లాలో మహిళలు, దళిత, గిరిజనుల మీద దాడులు, వృత్తిదారుల సమస్యలమీద సమాధానం చెప్పి ఆయా పార్టీలు ప్రజలను ఓట్లు అడగాలని కోరారు. జిల్లా ప్రజలకు ఆయా పార్టీలు ఈ సమస్యల మీద అనేక సార్లు పరిష్కారం కోసం హామీలు ఇచ్చాయని, ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కీలకమైన ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. అందుకే ప్రజలు రానున్న ఎన్నికల్లో విధాన పరమైన తీర్పు ఇవ్వాలని, ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చిన ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఇండియా వేదిక నుంచి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సిపిఎం మద్దతు ఇస్తుందని, వారి గెలుపునకు పాటుపడుతోందని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిజెపి, దాని తొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. దేశానికి, రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. తమకు అధికారం ఇస్తే నల్లధనాన్ని వెలికితీస్తామని, పేదరికాన్ని నిర్మూలిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి పదేళ్ల నుంచి వల్లె వేస్తోందన్నారు. వీటిల్లో ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారని, ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిమరల్చేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. మతోన్మాదులకు, దానితో జతకట్టిన వారికి, మద్దతిస్తున్న వారికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురాం, వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

టిడిపి ప్రచార వాహనాలు ప్రారంభం

టిడిపి ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న నాగసత్యలత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ ప్రచార వాహనాలను బిజెపి-టిడిపి-జనసేన పార్టీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు సతీమణి నాగసత్యలత ప్రారంభించారు. స్థానిక బికె ఎన్‌క్లేవ్‌లోని దామచర్ల నివాసం వద్ద గురువారం టిడిపి ప్రచార వాహనాలను ప్రారంభించారు. ప్రచార వాహనాలలో తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను ప్రదర్శించారు. ఈ ప్రచార వాహనాలు ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించి ప్రచారం నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో దామచర్ల జనార్ధనరావు కుమార్తె తనూజ లక్ష్మి, టిడిపి నాయకులు అనిల్, పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కరవదిలో దామచర్ల నాగ సత్యలత ప్రచారం

రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు సతీమణి దామచర్ల నాగసత్యలత ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఆమె ప్రచారం నిర్వహించారు. ప్రచారం దామచర్ల జనార్ధనరావు కుమార్తె దామచర్ల అనీషా లక్ష్మి, మాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు, టిడిపి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఎంపీగా అవకాశమివ్వండి

నామినేషన్ దాఖలు చేసిన మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాలో గత 33 సంవత్సరాలుగా మాగుంట కుటుంబం ప్రజలకు సేవ చేస్తుందని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి తన నామినేషన్ పత్రాలను గురువారం దాఖలు చేశారు. ఒంగోలు ప్రకాశం భవనంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దినేష్ కుమార్ కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు ఆయన సతీమణి గీతాలత, కుమారులు మాగుంట రాఘవరెడ్డి, చందనమ్మ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా తెలుగుదేశం..

టిడిపి సాధికారిక కమిటీ అధ్యక్షులు పిఎస్ బాబు

మాట్లాడుతున్న బాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న ఎన్నికలలో బిసిలకు అండగా ఉండే తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని టిడిపి సాధికారిక కమిటీ అధ్యక్షులు పిఎస్ బాబు తెలిపారు. స్థానిక విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో టిడిపి విశ్వబ్రాహ్మణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన మంచా బాబు మాట్లాడారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పతకమూరి బాలసుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు సదాశివ బ్రహ్మచారి, టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మానేపల్లి గోవిందా చారి, కార్పెంటర్ సంఘం నాయకులు మచ్చ సుబ్రహ్మణ్యం, పట్టణ కార్యదర్శి నందిపాటి సుబ్బ రత్నాచారి, యువజన సంఘం నాయకులు చూడ కోటేశ్వరావు పాల్గొన్నారు.

సిఎంఎస్ వాహనంలో రూ.64 లక్షలు చోరీ

నిందితుడిని వెంటనే పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు-కర్నూలు బైపాస్‌లో ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద సిఎంఎస్ వెహికల్‌లో రూ.64 లక్షలను ఓ వ్యక్తి చోరీ చేయగా.. పోలీసులు వెంటనే పట్టుకున్న ఘటన గురువారం జరిగింది. సిఎంఎస్ వెహికల్‌లోని సిబ్బంది గురువారం ఇండియన్ పెట్రోల్ బంకు లోపలికి వెళ్లి భోజనం చేశారు. తిరిగి వెహికల్ వద్దకు వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటంతో అవాక్కై.. వెహికల్‌లో ఉన్న డబ్బులు లెక్కించగా రూ.64 లక్షలు దొంగలు తీసుకెళ్లినట్లు అంచనాకు వచ్చారు. అందిన ఫిర్యాదుతో పోలీసులు వెంటనే నిందితుడైన కామేపల్లివారిపాలెం వాసిని గుర్తించి.. పట్టుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన వ్యయ పరిశీలకులు బిశ్వాస్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకునిగా వచ్చిన దూకే బిశ్వాస్ గురువారం ఒంగోలులో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలకు ఈయన వ్యయ పరిశీలకునిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఎన్నికల నిర్వహణపై చర్చించుకున్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిశ్వాస్

అట్టహాసంగా బూచేపల్లి నామినేషన్

వేలాదిగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు

నామినేషన్ ర్యాలీలో బూచేపల్లి, చెవిరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వేలాదిగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దర్శి రోడ్లన్నీ జనంతో కిక్కిరిశాయి. ఈ సందర్భంగా జనాన్ని చూసి అభివాదం చేస్తూ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు క్రేన్‌తో గజమాలలు వేసి.. స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దర్శిలో తన 20 సంవత్సరాలుగా బూచేపల్లి కుటుంబం సేవకుల్లా పని చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడూ తాను దర్శికే సేవలందిస్తానన్నారు. తాము పదవిలో ఉన్నా లేకపోయినా దర్శి నియోజకవర్గంలో కులమతాలకతీతంగా అన్ని వర్గాలకూ పని చేస్తున్నట్లు తెలిపారు. తనను తన తమ్ముడుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చారని, తమ మీద ఉన్న నమ్మకంతో ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో తనకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సందర్భంగా తనకు కురిచేడు, దొనకొండ మండలాలకు తాగునీరు, సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో తాను ఎప్పుడూ అభివృద్ధి కోసం కష్టి చేస్తానన్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తన తమ్ముడు శివను ఎమ్మెల్యేగా, తనను ఎంపీగా గెలిపిస్తే అండగా ఉంటామన్నారు. నియోజకవర్గానికి అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పడతానన్నారు. ఈ సందర్భంగా ముందుగా రాజంపల్లి ముసి సమీపాన ఉన్న ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర మంత్రి, మేరుగ నాగార్జున, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివప్రసాద్‌రెడ్డి సతీమణితో కలిసి దద్దానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీలో ప్రజలకు అభిమానం చేస్తూ గడియార స్తంభం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ ఎంపిఎస్ లోకేశ్వరరావుకు తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డితో పాటు శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని కూడా రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు ఎంపిటిసిలు, సర్పంచులు, పార్టీ కన్వీనర్లతో పాటు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

ఉద్యోగుల హక్కులను కాలరాస్తే ఊరుకోం..

- ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి -ఐక్య వేదిక చైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణ

మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందని, ఆ హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షన్ల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ కె.ఆర్. సూర్యనారాయణ తెలిపారు. 30 రోజుల పనికి జీతం, 30 ఏళ్ల సర్వీస్‌కి పెన్షన్ ఉద్యోగుల హక్కు అని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన స్థానిక రంగా భవన్ లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ కె.ఆర్. సూర్యనారాయణ మాట్లాడుతూ 30 రోజులు కష్టపడి పనిచేసిన తరువాత ఒకటో తారీకు జీతం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఆర్థికపర ప్రభుత్వంలో విలీనం ద్వారా ఎదురైన సమస్యల పరిష్కరించడంలో కొంత అలసత్వం జరిగిందన్నారు. ఆ ఉద్యోగులు కార్పొరేషన్‌కి చెందిన వారా లేక ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఐక్యవేదిక కో చైర్మన్ కరణం హరికృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గత 30 సంవత్సరాలుగా ఎలాంటి సర్వీస్ నిబంధనలు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. వీటిపై సరైన పరిష్కార మార్గాలను అన్వేషించడంలో, సూచించడంలో అటు ప్రభుత్వాలు, ఇటు ఉపాధ్యాయ సంఘాలు విఫలమయ్యాయన్నారు. ఐక్యవేదిక సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు జిపిఎస్ విధానాన్ని తీసుకువచ్చి రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులను నట్టేట ముంచారన్నారు. ఐక్య వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పి. వర కుమార్, ఏపి సిపిఎస్ఈఏ ఏ పాండు రంగారావు, ఎన్ మోహన్ రావు, రాము, నర్సింగరావు, విజయ్ కుమార్, సురేష్, పివి నారాయణ, కె. శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మాధవి, రమణారెడ్డి, రంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాను, మసూద్ అలీ పాల్గొన్నారు.

నామినేషన్ల కోసం కట్టుదిట్టమైన చర్యలు

- పార్టీల నేతలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలి..

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా విడుదల చేశారు. నామినేషన్ ప్రక్రియను బాపట్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి గురువారం ప్రారంభించారు. తదుపరి జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి స్పందన సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు.

పార్లమెంటు, శాసనసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 25వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 26వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన, 29న ఉపసంహరణ ప్రక్రియతో పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఒకటి, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అభ్యర్థులు ఎవరైనా నామినేషన్ వేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు నామినేషన్ తో పాటు వివరాలతో ధ్రువీకరణలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాల్సి ఉందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామన్నారు. జాతీయస్థాయి గుర్తింపు పొందిన పార్టీలు ఆమ్ ఆద్మీ పార్టీ, బిజెపి, నేషనల్ కాంగ్రెస్ పార్టీ, బి ఎస్ పి, సిపిఎం, నేషనల్ పీపుల్స్ పార్టీలు ఉండగా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు వైసిపి, టిడిపి పార్టీలు ఉన్నాయన్నారు.

హోమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 సంవత్సరాల దాటిన వారిని గుర్తించి వారి ఇంటికే వెళ్లి దరఖాస్తులను పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. 22వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్‌ఓలకు అందిస్తే మే నెల మూడు నుంచి 10వ తేదీ లోగా హోమ్ ఓటింగ్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే వారికి, అత్యవసర సేవల విభాగంలో ఉండే వారి కొరకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారికి రిటర్నింగ్ అధికారి వద్ద పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుండి స్టాటిక్ సర్వేలెన్స్ టీములు పనిచేయస్తాయని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.